భారతీయ జనతా పార్టీ
తెలంగాణ

Bharatiya Janata Party
Telangana

Dr. Shyamprasad Mukherjee Bhavan, Opp. Exhibition Grounds, Nampally, Hyderabad - 500 001.
: Office: 040-24653535, 24653311, Fax: 040-24653929, e-mail: gkishanreddy@yahoo.com

G. Kishan Reddy
State President
Union Minister of Tourism,
Culture and DoNER

11-05-2024

***శ్రీ రేవంత్ రెడ్డి గారికి***

కొద్దిరోజుల క్రితం జాతీయ మేనిఫెస్టో ప్రకటనలో భాగంగా తెలంగాణకు ప్రత్యేకంగా మీరు హామీలు ఇవ్వడం.. గత 10 ఏళ్లలో తెలంగాణకు మోదీ ప్రభుత్వం దాదాపు రూ.9 లక్షల కోట్ల సహకారం అందించిన విషయం తెలిసి ఉండీ మీ పార్టీ ప్రకటనల్లో తెలంగాణకు మోదీ ప్రభుత్వం ఏం చేయలేదంటూ విమర్శలు చేయడం... మీ పార్టీని మరింత దిగజార్చేలా ఉన్నాయి. తెలంగాణ ప్రజలను అవమానించేలా ఉన్నాయి. ఎందుకంటే వీటిలో చాలా హామీలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ఇప్పటికే అమలు చేసింది, మరికొన్నింటిని అమలు చేస్తోంది.

ఇప్పటికే 6 గ్యారెంటీలు, 420 వాగ్దానాలు అమలు చేయలేని మీరు తెలంగాణ ప్రజల దృష్టిలో ఈ లేఖ ద్వారా మీ పార్టీ విశ్వసనీయతరాహిత్యాన్ని తెలంగాణ ప్రజల ముందు ఉంచే ప్రయత్నం చేస్తున్నాను. మీ మేనిఫెస్టోలో పేర్కొన్న విషయాలను.. ఆయా అంశాల బ్యాక్‌గ్రౌండ్‌ను, తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాన్ని వివరిస్తున్నాను.

1. **73, 74వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీలకు నేరుగా కేంద్ర ప్రభుత్వ నిధుల మంజూరు**

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థకు నేరుగా నిధులు ఇస్తున్న విషయాన్ని మరిచిపోయి కాంగ్రెస్ పార్టీ ఈ ప్రకటన చేసినట్లుంది. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీరాజ్ సంస్థలకు నిధులను బదిలీ చేయడం లేదని తెలియడంతో.. పంచాయతీరాజ్ సంస్థల అకౌంట్లలోకి కేంద్ర ప్రభుత్వం 2022 నుంచి పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (PFMS) ద్వారా నేరుగా నిధులను జమ చేస్తోంది.

కేంద్రం ఇలా నేరుగా నిధులు ఇస్తుండటంతో.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు సహా కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ లాగిన్ వివరాలు తీసుకుని అక్కడి నుంచి కూడా నిధులను లాగేసుకుంటున్నాయి. దీంతో పంచాయతీల్లో కనీస వసతులకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

**దీనికి బదులుగా, మీ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోని ప్రభుత్వాలకు సూచించి.. 73, 74వ రాజ్యాంగ సవరణను గౌరవిస్తూ స్థానిక సంస్థల సాధికారతకు కృషి చేయాలని కోరుతున్నాను. అదే పంథాలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో పంచాయతీలకు మరిన్ని బాధ్యతలు అప్పగించాలి.**

**2. సౌర విద్యుత్ సామర్థ్యాన్ని వినియోగించుకోవడం ద్వారా ప్రతి ఇంట్లో విద్యుదుత్పత్తి జరిగేలా చర్యలు**

ఇటీవల కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024 తాత్కాలిక బడ్జెట్‌లో.. కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ గారు.. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను ప్రకటించారు. దీని ద్వారా ప్రతి ఇంటికీ 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతుంది.

**ఈ పథకానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి భయపడిన కాంగ్రెస్ పార్టీ.. ఈ అంశాన్ని కాస్త అటు, ఇటుగా మార్చి కొత్తగా ఏదో వాగ్దానం చేస్తున్నట్లు మేనిఫెస్టోలో పెట్టింది.**

**3. ఇంటర్నేషనల్ కల్చరల్, ఎంటర్‌టైన్‌మెంట్ హబ్**

హైదరాబాద్ నగరంలో దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, ఇందుకు కావాల్సిన స్థలాన్ని కేటాయించాలని 2022 నుంచి 2024వరకు కేంద్ర సాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వానికి పలు లేఖలు రాసింది. సంగీత నాటక అకాడమీకి సంబంధించిన ఈ ప్రాజెక్టులో భారత కళామండపం, గానగాంధర్వుడైన ఘంటసాల వెంకటేశ్వరరావు గారి శత జయంతి సందర్భంగా అత్యాధునిక వసతులతో ఆడిటోరియం వంటివి ఉన్నాయి.

**మీ రాష్ట్ర పార్టీ కాస్త శ్రద్ధ చూపించి.. దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రం, ఘంటసాల ఆడిటోరియం, CSIR-IICT ప్రాంగణంలో సైన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ వంటివి యువతను, విద్యార్థులను ఆకట్టుకుంటూ.. వారికి సాంస్కృతిక, విజ్ఞానపరమైన ప్రోత్సాహాన్ని అందిస్తూ.. హైదరాబాద్ నగరాన్ని కల్చరల్, ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా మారుస్తున్నాయనే విషయం మీకు చెప్పి ఉంటే బాగుండేది.**

**4. సమ్మక్క-సారక్క మేడారం జాతరకు జాతీయ హోదా**

పండగలు, జాతరలకు జాతీయ హోదా ఇచ్చే విషయంలో గతంలో తీసుకున్న నిర్ణయాలేమీ కనిపించడం లేదు. కానీ కేంద్ర ప్రభుత్వం.. సమ్మక్క-సారక్క జాతరకు వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల ద్వారా ఆర్థిక సహాయాన్ని ఇస్తోంది.

కేంద్ర పర్యాటక శాఖ ద్వారా.. మేడారం, చుట్టుపక్కల ప్రాంతాల్లో పర్యాటక ప్రాంతాలను కలుపుతూ 'ట్రైబల్ సర్క్యూట్'ను రూ.100కోట్లతో అభివృద్ధి చేసిన సంగతి మీకు తెలుసనే అనుకుంటున్నాను. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ కూడా ఈ దిశగా సహకారాన్ని అందిస్తోంది.

దీంతో పాటుగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు కూడా గిరిజన సంప్రదాయాలకు సంపూర్ణ గౌరవాన్ని ప్రకటిస్తూ.. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి సమ్మక్క–సారక్క గిరిజన విశ్వవిద్యాలయంగా నామకరణం చేశారు.

నరేంద్ర మోదీ గారి నేతృత్వంలో బీజేపీ స్పష్టమైన విధానానికి, తెలంగాణ సంస్కృతి కోసం ఆర్థిక సహాయం కావాలన్న విజ్ఞప్తికి కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ప్రతిస్పందించిన తీరుకు.. నక్కకూ, నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. 2012లో బోనాల పండగకు నిధులు విడుదల చేయాలని కోరిన నాటి మల్కాజ్‌గిరి ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత సర్వే సత్యనారాయణ డిమాండ్‌ను కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం వ్యతిరేకించిన విషయం మరిచిపోయారా? ఈ విషయం పార్లమెంట్ ప్రశ్నల ద్వారా స్పష్టమైంది.

**అలాంటప్పుడు మీరు చేస్తున్న దుష్ప్రచారాన్ని, తప్పుడు వాగ్దానాలను తెలంగాణ ప్రజలు ఎందుకు విశ్వసించాలి?**

## 5. హైదరాబాద్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ITIR) ప్రాజెక్టు

2008లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే.. ఈ ITIR ప్రాజెక్టు మంజూరైంది. హైదరాబాద్ చుట్టుపక్కల 202 చదరపు కిలోమీటర్లలో రూ.4,863 కోట్లతో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరగాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. 2013 వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ.. కేవలం రూ.165 కోట్లు విడుదల చేసింది. ఐదేళ్లలో మీరు సమయాన్ని వ్యర్థం చేయడం మినహా చేసిందేమైనా ఉందా?

2014 నాటికి.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ హబ్‌గా హైదరాబాద్ ప్రత్యేకమైన గుర్తింపును పొందడంతోపాటుగా రోజురోజూ తన పరిధిని విస్తరించింది. వివిధ మల్టీనేషనల్ కంపెనీలు కూడా.. తెలంగాణలో కంపెనీలు పెట్టేందుకు సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాయి. దీంతో రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని.. ఫ్యాబ్ సిటీలో రూ.400 కోట్ల కేంద్ర ప్రభుత్వ సహాయంతో రెండు కొత్త ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల ఏర్పాటుకు ముందడుగు పడింది.

**ఆరేళ్లపాటు అధికారంలో ఉండి.. రెండు సార్లు ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన మీ పార్టీ.. ITIR ప్రాజెక్టుకు ఏమీ చేయని మీరు.. ఇకపై ఏదో చేస్తామంటే ప్రజలు ఎందుకు నమ్మాలి?**

## 6. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను పూర్తి చేయడంలోనూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తూ.. రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ (RMU)ను

ఏర్పాటు చేసింది. రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో పేర్కొన్నా.. రూ.521 కోట్లతో RMUను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రం కోచ్‌లతో పాటుగా ఇంజన్లను కూడా ఉత్పత్తి చేయనుంది. రైల్వే శాఖ టార్గెట్ గా పెట్టుకున్న 2027 నాటికి 3వేల మిలియన్ టన్నుల సరుకు రవాణాను పూర్తి చేసే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు కొనసాగుతోంది.

2023 జూలై నెలలో ప్రధానమంత్రి మోదీ గారు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన విషయం మీకు తెలుసని అనుకుంటున్నాను. ఈ ప్రాజెక్టు ద్వారా 3వేల మంది స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అలాంటప్పుడు పూర్తయిన హామీని నెరవేరుస్తామని చెప్పడం ద్వారా మీరు ఎవరిని మోసం చేద్దామనుకుంటున్నారు?

## 7. బయ్యారంలో ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటు

బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై నిపుణుల కమిటీ ద్వారా విశ్లేషించినపుడు.. ఇక్కడ లభించే ఐరన్ ఓర్ నాణ్యత, ప్రాజెక్టు ఆర్థిక సామర్థ్యం తదితర అంశాల్లో భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లు వెల్లడయ్యాయి. దీంతో.. వేల కోట్ల ప్రజాధనాన్ని వ్యర్థం చేయకూడదనే ఉద్దేశంతో ప్రాజెక్టు సాధ్యం కాదనే విషయాన్ని బీజేపీ స్పష్టంగా వెల్లడించింది. కానీ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఏదేమైనా ఈ ఫ్యాక్టరీ నిర్మిస్తామని ప్రగల్భాలు పలికారు.

**రాజకీయ అవసరాల కోసం కాంగ్రెస్ పార్టీ బయ్యారం ఉక్కు కార్మాగారాన్ని తెరపైకి తెచ్చిందని, ఇవన్నీ ఉత్తి హామీలేనని తెలంగాణ ప్రజలు గ్రహిస్తున్నారు.**

## 8. డ్రై పోర్టుల స్థాపన

2020లో నరేంద్ర మోదీ ప్రభుత్వం.. ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపోస్ (ICDs), కంటైనర్ ఫ్రైట్ స్టేషన్స్ (CFSs), ఏయిర్ ఫ్రైట్ స్టేషన్స్ (AFSs) ఏర్పాటు కోసం కొత్త విధివిధానాలను ప్రవేశపెట్టింది. దీంట్లో భాగంగా.. తెలంగాణను.. గ్రీన్‌జోన్ గా గుర్తించి పై వసతులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

ప్రస్తుతానికి తెలంగాణలో రెండు ICDలు, CFSలు ఉన్నాయి. వీటి సామర్థ్యం 1,24,825 ట్వంటీ ఫూట్ ఇక్వివాలెంట్ యూనిట్స్ (TEUs)

**పీఎం గతిశక్తి కార్యక్రమంలో భాగంగా.. దేశ అనుసంధానతను, డ్రైపోర్టుల ఏర్పాటు ద్వారా దేశ ఆర్థిక సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నం జరుగుతున్న సంగతి మీకు తెలుసనుకుంటున్నాను. మీరు చేయాల్సిందల్లా.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ విధానాల్లో మార్పులు చేసుకుని సహకరించడమే.**

## 9. హైదరాబాద్‌లో IIM, IIFT ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 13వ షెడ్యూల్‌లో.. ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఐఐటీ, ఒక ఎన్ఐటీ, ఒక ఐఐఎం, ఒక IISER, ఒక కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఒక పెట్రోలియం యూనివర్సిటీ, ఒక వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఒక ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేయాలని ఉంది. కానీ ఇందులో తెలంగాణలో ఏర్పాటు చేసే విద్యాసంస్థలను ప్రస్తావించలేదు.

హైదరాబాద్‌లో ఇప్పటికే ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, ఐఐటీ (కంది) వంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలున్నాయి. విభజన చట్టంలో తెలంగాణలో ఏయిమ్స్ ఏర్పాటు విషయం లేకపోయినా.. మోదీ గారు బీబీనగర్ లో ఎయిమ్స్ ఏర్పాటు చేశారు. ప్రధానమంత్రి మోదీ గారి సమగ్రాభివృద్ధి విధానానికి ఇదొక ఉదాహరణ మాత్రమే.

విభజనచట్టంపై చర్చ సందర్భంగా తెలంగాణలో ఎయిమ్స్ ఏర్పాటును మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ తిరస్కరించిన విషయాన్ని మీరు గుర్తుచేసుకోవాలి. ఇలాంటప్పుడు, హఠాత్తుగా మీరు ఒలకబోస్తున్న ప్రేమను అర్థం చేసుకున్న తెలంగాణ ప్రజలు మిమ్మల్ని ఎందుకు విశ్వసించాలి?

## 10. హైదరాబాద్ లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసర్చ్ (IISER) ఏర్పాటు

రాష్ట్ర విభజన చట్టంలోని 13 షెడ్యూల్‌లో ఏపీలో IISER ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కానీ తెలంగాణలో ఇలాంటి సంస్థ ఏర్పాటుపై ఎలాంటి మాటా చెప్పలేదు. కానీ, హైదరాబాద్‌లో రూ.230కోట్లతో సైన్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసి దీన్ని పూర్తిస్థాయిలో ‘సైన్స్ సిటీ’గా మార్చే ప్రయత్నం ప్రారంభమైంది. ఈ కేంద్రం యువతలో సైన్స్ పట్ల వినూత్నరీతిలో ఆసక్తిని పెంపొందిస్తూ.. హైదరాబాద్‌ను సైంటిఫిక్ ఇన్నొవేషన్ రంగంలో ప్రత్యేకమైన కేంద్రంగా నిలబెట్టనుంది. ఈ కేంద్రంలో ఇండోర్ ఎగ్జిబిషన్, సైన్స్ ఎక్స్‌పొజిషన్ హాల్, కాన్ఫరెన్స్ హాల్, సైన్స్ పార్క్, ఆధునిక సాంకేతికతను, నానోసైన్స్, రొబోటిక్స్ పై యువతకు, విద్యార్థులకు తెలియజేసేలా ఏర్పాట్లున్నాయి. దీంతోపాటుగా సైన్స్ పై చర్చించేందుకు, కొత్త విషయాలు తెలుసుకునేందుకు ఆధునిక విజ్ఞానంపై ఆసక్తిని కనబరిచేందుకు కూడా ఏర్పాట్లున్నాయి.

**యూపీఏ ప్రభుత్వం తెలంగాణలో సైన్స్ ప్రోత్సాహానికి ఎలాంటి అంశాలను రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొననప్పటికీ.. మోదీ ప్రభుత్వం హైదరాబాద్‌ను వైబ్రెంట్ ఇన్నొవేషన్ హబ్ గా మార్చేందుకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తోంది.**

## 11. వైద్యరంగంలో అత్యాధునిక పరిశోధనల కోసం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసర్చ్ (ICMR) ఏర్పాటు

భారతీయ బయోమెడికల్ రంగంలో పరిశోధనల కోసం 2022 డిసెంబర్లో.. హైదరాబాద్ లోని జినోమ్ వ్యాలీలో.. రూ.350 కోట్ల నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయో మెడికల్ రీసర్చ్ (**ICMR–NARFBR**)ను ప్రారంభించుకున్నాం. వివిధ పశు సంబంధిత అంశాలకు సంబంధించిన అత్యాధునిక కేంద్రం ఇది. 4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన సంస్థ.. దక్షిణాసియాలోనే అత్యాధునికమైనది.

శామీర్‌పేటలో.. అత్యాధునిక వసతులతో నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం) ఏర్పాటు చేశాం. కొత్తగా ఎదురువుతున్న వ్యాధులపై ఈ కేంద్రం పరిశోధనలు చేస్తుంది.

**NCDC, NARFBR వంటి సంస్థల ఏర్పాటులో కేంద్ర ప్రభుత్వం.. చూపిస్తున్న చిత్తశుద్ధికి.. యూపీఏ ప్రభుత్వంలో ఈ ప్రాంతం ఎదుర్కొన్న వివక్షకు ఏమాత్రం పొంతనలేదు. అలాంటిది.. మీరు ఏదో చేస్తానంటే తెలంగాణ ప్రజలు నమ్మాలా?**

## 12. భద్రాచలం ఆలయం అభివృద్ధి, ఏపీలో కలిపిన 5 గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపడంపై..

2014లో కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం రూపొందించి, ఆమోదించింది. దాని పర్యవసానమే భద్రాచలం మండలంలోని ఐదు గ్రామాలు – ఏటపాక, గుండాల, పురుషోత్తంపట్నం, కన్నెగూడం మరియు పిచుకలపాడు ఆంధ్రప్రదేశ్ కు బదిలీ అయ్యాయి.

ఇవాళ మీరు భద్రాచలం రామాలయ అభివృద్ధి తదితర అంశాలపై మొసలికన్నీరు కారుస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం.. ప్రసాద్ పథకంలో భాగంగా.. నిధులు కేటాయించి పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలను అందించింది. ఇందులో వ్రతమండపం, కల్యాణమండపం, బ్యాటరీతో నడిచే కార్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, బట్టలు మార్చుకునే గదులు, డిజిటల్ ప్రొజెక్షన్ రూమ్, ప్రసాదాల తయారీలో మెకనైజేషన్, సౌండ్ అండ్ లైట్ షో వంటివి ఉన్నాయి.

వీటికి గౌరవ భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ముగారి ద్వారా శంకుస్థాపన చేయించాం. అమృత్ భారత్ పథకంలో భాగంగా భద్రాచలం స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నాం. రామాయణ్ సర్క్యూట్ లో భద్రాచలాన్ని చేర్చాం.

**మేం ఇవన్నీ చిత్తశుద్ధితో చేస్తున్నాం. మీకు అవకాశం ఉన్నప్పుడు అబద్ధపు వాగ్దానాలు ఇచ్చిన మీరు ఇవాళ ఏదో చేస్తామంటే ప్రజలు నమ్మాలా?**

## 13. రామగుండం-మణుగూరు రైల్వే లైన్ ఏర్పాటు

రామగుండం, మణుగూరు మధ్య కొత్త రైల్వేలైను వేస్తామని మీరు చెబుతున్నారు. మీకో విషయం తెలియదనుకుంటాను. 2022లోనే దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈ మార్గానికి సంబంధించిన ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తి చేసి డీపీఆర్ సిద్ధం చేశారు. 2021లో మా ప్రభుత్వం యునెస్కో గుర్తింపు తీసుకొచ్చిన రామప్ప ఆలయాన్ని అనుసంధానం చేస్తూ.. ఈ లైన్ వెళ్తుంది.

**రూ. 4వేల కోట్లతో ఈ 200 కిలోమీటర్ల ప్రాజెక్టు ప్రారంభం కానుంది. అన్ని సంబంధిత పనులు పూర్తయ్యాయి. కేబినెట్ ఆమోదం రాగానే పనులు ప్రారంభం కానున్నాయి.**

**నరేంద్రమోదీ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులకు కాంగ్రెస్ పార్టీ ఎందుకు క్రెడిట్ తీసుకోవాలనుకుంటుందో నాకర్థం కావడం లేదు?**

## 14. తెలంగాణలో కొత్త సైనిక పాఠశాలల ఏర్పాటు

వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం, ఎల్కతుర్తి గ్రామంలో సైనిక పాఠశాల ఏర్పాటు కోసం 2017 నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం భూబదలాయింపు ఒప్పందంపై సంతకం చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆ తర్వాత ఇసుమంతైనా సహకారం అందించలేదు. నేను నాటి సీఎం కేసీఆర్‌కు దీనిపై రెండుసార్లు లేఖలు రాసినా స్పందన లేదు.

స్వచ్ఛంద సంస్థలు, ప్రయివేటు పాఠశాలలు, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దేశవ్యాప్తంగా 100 పాఠశాలలను దశలవారీగా, తరగతుల వారీగా (ఆరో తరగతి నుంచి ప్రారంభం) ప్రారంభించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. తర్వాత ఇందులో 40 పాఠశాలలు ప్రారంభమయ్యాయి. కానీ.. ఇందులో ఒక్కటి కూడా తెలంగాణ నుంచి లేకపోవడం దురదృష్టకరం. ఇది రాష్ట్ర ప్రభుత్వ అహంకారపూరిత, నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం.

**రక్షణ శాఖతో కుదుర్చుకున్న ఒప్పందానికి అనుగుణంగా సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎవరు అడ్డుకుంటున్నారు. సైనిక పాఠశాలల సొసైటీ రాష్ట్రంలో 4 ఇలాంటి పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉంది.**

## 15. కేంద్రీయ విద్యాలయాల సంఖ్యలో పెంపు, రెట్టింపైన నవోదయ విద్యాలయాలు

రాష్ట్రంలోని 36 కేంద్రీయ విద్యాలయాలుంటే.. ఇందులో 9 అంటే 25 శాతం.. 2014లో మోదీ ప్రభుత్వం వచ్చాకే కేటాయించబడ్డాయి. ఇది తెలంగాణలో విద్యారంగం అభివృద్ధిపై మోదీ సర్కారు చిత్తశుద్ధికి నిదర్శనం.

తెలంగాణలో పెరిగిన జిల్లాలకు అనుగుణంగా నవోదయ విద్యాలయాలను కూడా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

**జూన్ 2024లో ఎన్నికల కోడ్ పూర్తయిన తర్వాత మరో 15 కొత్త పాఠశాలల ఏర్పాటును ప్రకటించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర విద్యాశాఖ, కేంద్ర ఆర్థిక శాఖలో చర్చల సందర్భంగా వెల్లడైంది.**

## 16. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారికి సమాంతరంగా ర్యాపిడ్ రైల్ ట్రాన్సిట్ సిస్టమ్

హైదరాబాద్ (శంషాబాద్), విశాఖపట్టణం మధ్య హైస్పీడ్ రైల్ లైన్ కోసం.. ఫైనల్ లొకేషన్ సర్వే మంజూరైంది. దీని ద్వారా విశాఖపట్టణం, విజయవాడలకు హైదరాబాద్ నుంచి గంటకు 220 కిలోమీటర్ల గరిష్ట వేగంతో రైళ్లో ప్రయాణం చేయవచ్చు. ఈ విషయంలో మీరు చెప్తున్న దాని కన్నా ఎక్కువే చేస్తున్నాం.

ఇదే సమయంలో, రీజనల్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా 563.5 కిలోమీటర్ల మేర ఔటర్ రింగ్ రైల్ ప్రాజెక్టు ఫైనల్ లొకేషన్ సర్వేకు కూడా ఆమోదం లభించింది. దీంతోపాటుగా.. రూ.12,500 కోట్లతో 'బైపాస్ కమ్ రైల్ ఓవర్ రైల్' ప్రాజెక్టునకు కూడా ఆమోదం లభించింది.

ఇలా మోదీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి అంకితభావంతో పని చేస్తుంటే.. మీరు అబద్ధాలను ప్రచారం చేస్తూ.. మీరు చేయలేని వాటిని కూడా చేస్తామని చెప్పుకోవడం హాస్యాస్పదం.

## 17. తెలంగాణలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటు

ఆదిలాబాద్, జక్రాన్‌పల్లి (నిజామాబాద్), వరంగల్‌ల్లో విమానాశ్రయాల ఏర్పాటు 2021 నుంచి పెండింగ్ లో ఉంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ఆయా ప్రాంతాలతో పాటుగా తెలంగాణలో మరింత అభివృద్ధి జరుగుతుందని, ఇందుకు సహకరించాలని 2022 జూలై, 2023 ఫిబ్రవరిలో నాటి సీఎం కేసీఆర్‌కు లేఖలు రాశాను. దేశంలో జరుగుతున్న విమానయాన రంగ సంస్కరణల్లో తెలంగాణ భాగస్వామిగా మారేందుకు ఉన్న అవకాశాలను ఆ లేఖలో పేర్కొన్నాను. కానీ కేసీఆర్ స్పందించలేదు.

ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడింది. కాబట్టి, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు సహకరించేందుకు ముందుకు రావాలని కోరుతున్నాను. కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారానికి సిద్ధంగా ఉంది.

## 18. జాతీయ విమానయాన విశ్వవిద్యాలయం ఏర్పాటు

దేశంలోనే మొట్టమొదటి సివిల్ ఏవియేషన్ రీసర్చ్ ఆర్గనైజేషన్ (CARO)ను హైదరాబాద్ లోని బేగంపేటలో ఏర్పాటు చేశాం. 2024 మార్చిలో ప్రధానమంత్రి దీనిని జాతికి అంకితం చేశారు. పౌరవిమానయాన రంగంలో

అత్యాధునిక సంస్కరణలకు, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు CARO కీలకం కానుంది. ఎయిర్ నావిగేషన్ వ్యవస్థ (ANS), ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కమ్యూనికేషన్స్ డొమైన్ సిములేటర్స్, నెట్‌వర్క్ ఎమ్యులేటర్, విజువలైజేషన్ & అనాలసిస్ ల్యాబ్స్, సర్వేలెన్స్ ల్యాబ్స్, నేవిగేషన్ సిస్టమ్స్, సైబర్ సెక్యూరిటీ, థ్రెట్ అనాలసిస్ వంటి ఎన్నో అంశాలపై పరిశోధన జరగనుంది.

**మీ రాష్ట్ర విభాగం, ఈ కేంద్రం పేరును మార్చి దీన్ని మీరు చేయబోయే ఘనకార్యంగా చెప్పుకునే ప్రయత్నం మీ అవివేకానికి నిదర్శనం**.

కాంగ్రెస్ పార్టీ కనీస అవగాహన లేకుండా.. క్షేత్రస్థాయి వాస్తవాలకు దూరంగా ఇలాంటి అబద్ధాలను ప్రచారం చేస్తున్న విషయం స్పష్టంగా అర్థమవుతుంది.

ఈ సందర్భంగా, మీ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయాలని మీ రాష్ట్రపార్టీకి సూచించాలని మిమ్మల్ని కోరుతున్నాను. ఈ హామీలను మీరు అమలు చేయడంపై దృష్టి పెట్టకుండా.. పార్లమెంటు ఎన్నికల కోసం అబద్ధపు హామీలు ఇవ్వడం.. మీ బాధ్యతల నుంచి తప్పించుకోవడమే అని అర్థమవుతోంది.

ఇలాంటి పరిస్థితుల్లో, మీరు చేస్తున్న అసత్యపు ప్రచారాల నుంచి ప్రజలను అప్రమత్తం చేయడం నా కర్తవ్యం, నా బాధ్యత. అందుకే ఈ సుదీర్ఘమైన లేఖను తెలంగాణ ప్రజలకు కూడా అందజేస్తున్నాను.

ధన్యవాదములు.

భవదీయ

**(జి. కిషన్ రెడ్డి)**
తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు,
భారతీయ జనతా పార్టీ,
కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య
రాష్ట్రాల అభివృద్ధి శాఖల మంత్రి